ప్రజాశక్తి
సోమవారం 18 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం

ఏచూరికి ఘన నివాళి

ఏచూరికీ నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మక్కువ : సిపిఎం జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి మండలంలోని శంబరలో సిపిఎం నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి చేపట్టిన ప్రజాపోరాటాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు ఆదినారాయణ, తాడంగి ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏం జరుగుతుందో!?

- చీఫ్ ఇంజనీర్ ట్రాప్ వ్యవహారం ఎటు మలుపు తిరుగుతుందో...
- టిడిపి శిబిరంలో గుబులు పుట్టిస్తున్న ఎసిబి కేసు
- గిరిజన సంక్షేమ అధికారుల్లోనూ ఉత్కంఠ

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర స్థాయిలో సంచలనం సృష్టించిన గిరిజన సంక్షేమ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ఎసిబి కేసు వ్యవహారంలో ఏం జరుగుతుందోనని టిడిపి నాయకులు, కార్యకర్తల్లో ఒకింత ఆందోళన రేకెత్తిస్తోంది. చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌పై ఎసిబి అధికారుల దాడి అనంతరం పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అసలు ఎసిబి దాడి వెనుక అధికారపార్టీకి చెందిన ఓ కీలక నేత స్కెచ్ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఆ నేతకు తెలియకుండా గిరిజన సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాల నేపథ్యంలో ఆయనే స్వయంగా ఎసిబి ట్రాప్‌కు పురమాయించారనే వాదనలు కూడా తెరపైకి వస్తున్నాయి. గిరిజన సంక్షేమ శాఖలో ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్ కృష్ణంరాజు పెండింగ్ బిల్లులు రూ.35 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ గత కొంతకాలంగా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ చుట్టూ తిరుగుతున్నారు. బిల్లులు మంజూరుకు చీఫ్ ఇంజనీర్ రూ.5కోట్లు డిమాండ్ చేసినట్లు కాంట్రాక్టర్ కృష్ణంరాజు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన టిడిపికి చెందిన కీలక నేత దృష్టికి తీసుకెళ్లి తన గోడు వెళ్లగక్కినట్లు ఆయన చెప్పారు. రూ.35 కోట్లు బిల్లు మంజూరు కాకపోతే ఆత్మహత్యే శరణ్యమని కూడా ఆయన ఆ కీలక టిడిపి నేతకు మెయిల్ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఇది జరిగిన తర్వాతనే చీఫ్ ఇంజనీర్‌పై ఎసిబి అధికారులు వలపన్ని రూ.25లక్షలు తీసుకుంటుండగా పట్టుకోవడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారపార్టీ కీలకనేత స్కెచ్ ప్రకారమే ఎసిబి అధికారులు దాడి చేశారనేది తేటతెల్లమైంది. అయితే ఈ వ్యవహారంలో చీఫ్ ఇంజనీర్ తొలి విడత గా అందుకున్న రూ.25లక్షలు ఓ మహిళా నేతకు వరలక్ష్మి వ్రతం కానుకగా ఇవ్వాలని భావించినట్లు మీడియాలో వచ్చింది. అంతేకాకుండా చీఫ్ ఇంజనీర్ ఎసిబి అధికారులు వలపన్ని దాడి చేసిన సమయంలో కూడా ఒక చోటా గిరిజన నాయకుడు అక్కడే ఉన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. చీఫ్ ఇంజనీర్‌పై ఉన్న పాత ఎసిబి కేసులు రద్దు చేయడం, ఆయన సర్వీస్‌ను మరో రెండేళ్ల పాటు పొడిగింపునకు అంగీకరించడం వెనుక ఆ చోటా గిరిజన నాయకుడు కీలకపాత్ర పోషించారని తెలుస్తోంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన ఫైళ్లను ఆ చోటా గిరిజన నాయకుడే దగ్గరుండి నడిపి డీల్ కుదుర్చుకున్నారనే ఊహాగానాలు చెలరేగుతున్నాయి. దీనిలో భాగంగా చీఫ్ ఇంజనీర్ ఆ చోటా నాయకుడు, ఆయన తల్లికి పెద్ద ఎత్తున ముడుపులు ముట్టజెప్పారనే గుసగుసలు తెరపైకి వస్తున్నాయి. ఏదిఏమైనా ఈ వ్యవహారంలో ఎవరి కొంప మునుగుతుందోనన్న ఆందోళన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

గిరిజన సంక్షేమ అధికారుల్లో ఉత్కంఠ

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలో కీలకమైన చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ఎసిబి అధికారులకు చిక్కడంతో ఆ శాఖ అధికారులు, ఉద్యోగులలో ఉత్కంఠ కనిపిస్తోంది. గత ఏడేళ్లుగా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ గిరిజన సంక్షేమ శాఖలో ఆడిందే ఆట, పాడిందే పాటలా సాగింది. గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో కీలక ఎమ్మెల్యే, మంత్రులను ప్రసన్నం చేసుకొని తన మాట చెల్లుబాటయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఆ శాఖలో ఆయనకు శత్రువులైన అధికారులు కూడా దండిగానే వున్నట్లు తెలుస్తోంది. తనను వ్యతిరేకించిన అధికారులను తొక్కేయడం, ఇష్టారాజ్యంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం వంటి అంశాలు గిరిజన సంక్షేమ శాఖలో ఆయనకు శత్రువులను పెంచిందనే ప్రచారం సాగుతోంది. సీతంపేట గిరిజన సంక్షేమశాఖ ఇఇలుగా ఇద్దరు అధికారులను నియమించడం వెనుక చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. సీతంపేట గిరిజన సంక్షేమ ఇఇగా రమాదేవి వ్యవహరిస్తున్నారు. రమాదేవితో నెలకొన్న విభేదాల కారణంగా ఆమె పని చేస్తున్న స్థానంలో మరో ఇఇ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ప్రస్తుతం అక్కడ ఇద్దరు ఇఇలు పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాకుండా ఆయన గతంలో ఎఇ, డిఇగా పని చేసిన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో జరిగిన పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖలో కింద స్థాయి నుంచి పైస్థాయి వరకు అంతా తన కనుసన్నల్లో జరగాలని భావించిన చీఫ్ ఇంజనీర్ చివరికి మూడోసారి ఎసిబి వలలో చిక్కారు. అయితే ఆయన ఈసారి ఎసిబి వలలో చిక్కడం రాష్ట్ర స్థాయిలో సంచలనానికి దారి తీసింది. చీఫ్ ఇంజనీర్ స్థాయిలో రూ.35కోట్లు బిల్లు మంజూరు చేయడానికి రూ.5కోట్లు లంచం డిమాండ్ చేయడం వెనుక ఎవరి ప్రోద్బలం వుందనేది చర్చనీయాంశమవుతోంది. ఈ సంఘటన మున్ముందు అటు రాజకీయాల్లో, ఇటు గిరిజన సంక్షేమ శాఖ అధికారుల్లో ఎవరి కొంప మునుగుతుందోనన్న ఆందోళన రేకెత్తిస్తోంది.

మన్యం స్వ'రూపం' మారనుందా?

జిల్లాలో సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - సాలూరురూరల్



వైసిపి హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజనలో జరిగిన లోపాలను సరిదిద్దుతామని, అలాగే ప్రజలకు సమస్యలు లేకుండా చేస్తానని ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు చర్యలు ప్రారంభించారు. జిల్లాల పునర్విభజనతో ప్రజలు పడుతున్న సమస్యలు తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్లు మార్పులు, చేర్పుల కోసం అధ్యయనం కోసం ఏడుగురు సభ్యులతో మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మంత్రి వర్గ ఉపసంఘానికి కన్వీనర్‌గా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ఆదేశాల్లో ప్రభుత్వం వెల్లడించింది. పరిపాలన సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన సిఫార్సులు చేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం సూచించింది. జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతం చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని పరిగణనలోకి సూచించింది. సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం అంతరాల్లేని విధంగా కొత్త ప్రాంతాల సరిహద్దులను నిర్దేశించాలని సూచించింది. జనాభా, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సరిహద్దులు నిర్ణయించాలని సూచించింది. పలు కొత్త జిల్లాల ఏర్పాటు సహా జిల్లాల సరిహద్దుల మార్పులు చేయాలని పలు ప్రాంతాల్లో ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈ పరిస్థితుల్లో సరిహద్దులు, పేర్లపై ప్రజలు, ప్రజానిధుల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలనూ పరిగణనలోకి తీసుకుని అందుకు తగ్గట్లుగా సిఫార్సులు చేయాలని మంత్రి వర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి విభజన సమయంలో కనీసం ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేయకపోవడంతో ప్రజలు ఏమీ చేయలేక ప్రభుత్వం నియమించిన కమిటీ ఆధారంగానే జిల్లాను విభజించారు. అప్పుడే చాలామంది ఈ జిల్లా విభజన వల్ల చాలా ఇబ్బందులు వస్తాయని, జిల్లా ప్రధాన కేంద్రానికి రావడానికి సీతంపేట, భామిని మండలాలకు ఒక రోజు సమయం పడుతుందని ఆనాడే వారు సంబంధిత అధికారులకు తెలియజేసినా కనీసం అప్పటి ప్రభుత్వం పట్టించుకోకుండా వారికి నచ్చినట్టు జిల్లాను విడదీశారని ఈ జిల్లా ప్రజలు ఇప్పటికీ చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ జిల్లాల పునర్విభజన, సరిహద్దుల గుర్తించి అక్కడ ప్రజాప్రతి నిధులు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పుడు జిల్లా స్వరూపం మారబోతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా స్వరూపం మారనుందా..? నియోజకవర్గాల విలీనంతో పాటు మండ లాల చేర్పులు, మార్పులకు అవకాశం ఉందా..? అంటే అవుననే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాల విభజనకు ముందు పార్వతీపురం డివిజన్ పరిధిలో 15 మండలాలు, సాలూరు, బొబ్బిలి మున్సిపాల్టీలు ఉండేవి. బొబ్బిలి తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలు కూడా ఈ డివిజన్‌లోనే ఉండేవి. అయితే కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత బొబ్బిలి నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలో చేర్చారు. ఇక సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజవర్గాలతో పాటు కేవలం 15 మండలాలతోనే నాటి ప్రభుత్వం మన్యం జిల్లాను ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పాలకొండ నగరపంచాయతీ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాలను మన్యం జిల్లాలో కలిపారు. ఈ క్రమంలోనే రాజకీయ ఒత్తిడి కారణంగా సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో చేర్పించారు. సంక్షేమ పథకాల అమలు, సరిహద్దు సమస్యలు తదితర కారణాల రీత్యా కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మెంటాడ మండలం తిరిగి సాలూరు నియోజకవర్గంలో కలిసే అవకాశం ఉంది. ఇప్పటికే పాలకొండ నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్‌తో అక్కడ జిల్లా సాధన సమితి పేరుతో స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలా చేయనిచో పాలకొండ నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లాలో విలీనం చేయాలని వారు కోరుతున్నారు. అలాగే సాలూరు ప్రాంతంలో కూడా చాలామంది పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండను శ్రీకాకుళం జిల్లాలో కలిపితే జిల్లా విభజనకు ముందు పార్వతీపురం డివిజన్ పరిధిలో ఉండే బొబ్బిలి ప్రాంతాన్ని పార్వతీపురం జిల్లాలో చేర్చాలని డిమాండ్‌ను మెజార్టీ ప్రజల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రజల అభిప్రాయాలను మంత్రి వర్గ ఉపసంఘం ఏ మేరకు పరిగణలోకి తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, నాయకులు

నిలిపేసిన వికలాంగ పింఛన్లు పునరుద్ధరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

వివిధ కారణాలను సాకుగా చూపించి సుమారు 2 వేల మంది వికలాంగుల పెన్షన్లను జిల్లాలో రద్దు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం తీవ్ర అభ్యంతరకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు చెప్పారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఆర్భాటంగా హామీల వర్షం కురిపించిన కూటమి నేతలు ఇప్పుడు పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలను కుదించేందుకు కుట్రలు చేస్తున్నారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని విమర్శించారు. తల్లికి వందనం, రైతు భరోసా, వికలాంగుల పెన్షన్లు వంటి పథకాల్లో అనర్హుల పేరిట నిజమైన అర్హత కలిగి, అనేక ఏళ్లుగా లబ్ధిపొందుతున్న వారిని కూడా దూరం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన వికలాంగుల పెన్షన్లను రద్దు చేసే ఆలోచన మానుకోకపోతే సిపిఎం ఆధ్వర్యాన పెద్ద ఎత్తున లబ్ధిదారులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కలెక్టరేట్ ఎదుట సోమవారం జరిగే నిరసనలో పాల్గొనండి

మన్యం జిల్లాలో వివిధ కారణాలతో సుమారు 2వేల మంది వికలాంగులను పెన్షన్లకు దూరం చేసి వారి జీవనాన్ని అగమ్య గోచరంగా మార్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించిందని గంగునాయుడు చెప్పారు. ఈ ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యాన లబ్ధిదారులతో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని ఈ నిరసన కార్యక్రమంలో బాధిత లబ్ధిదారులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, బివి రమణ, గొర్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

ఊపందుకోనున్న ఉబాలు
నేడు, రేపు జిల్లాలో భారీ వర్షాలు

ప్రజాశక్తి - విలేకరుల బృందం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మన్యం జిల్లాలోని పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం వరకు పొడిగా ఉన్న వాతావరణం అల్పపీడనం కారణంగా ఆదివారం సాయంత్రం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, సీతంపేట, కురుపాం, వీరఘట్టం, పాలకొండ, కొమరాడ, పాచిపెంట తదితర తదితర మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఉడిచి నాట్లుకు, ఆరుతడి పంటలకు ఈ వర్షాలు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దమ్ములు కూడా ముమ్మరంగా ప్రారంభం కానున్నాయి.

సీతంపేట : మండలంలోని ఆదివారం సాయంత్రం వర్షం ప్రారంభమైంది. ఏజెన్సీలో ఇప్పటికే సాగునీరు లేక వర్షంపై ఆధారపడి రైతులు సరైన వర్షాల్లేక ఇప్పటికీ వరి నాట్లు వేయలేదు. గెడ్డల పక్కన ఉన్న భూముల్లో ఎద జల్లారు. అయితే ఈ వర్షం కొంతమేరకు దోహదపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అల్లం, పసుపు వంటి పంటలకూ కూడా వర్షం దోహదపడుతుంది. గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో ఇప్పటికే గెడ్డల్లో నీరు పొంగిపొర్లుతుంది.

వట్టిగెడ్డకు వరద పోటు

వీరఘట్టం : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారిగా వట్టిగెడ్డకు వరద పోటు ఎక్కువైంది. వట్టిగెడ్డలోకి పెద్దబుడ్డిడి, చలివేంద్రి, కంబర, బూరుగ, నడుకూరు, యు.వెంకంపేట, తదితర గ్రామాలకు చెందిన కొండ కాలువల నీరు వట్టిగెడ్డలోకి చేరడంతో వరద నీరు క్రమీపీ చేరడం వల్ల గెడ్డ పక్కన నివాసముంటున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వట్టిగెడ్డలో పెరిగిన వరద ఉధృతి

సీతంపేటలో ఆదివారం రాత్రి కురుస్తున్న భారీ వర్షం

పార్వతీపురంటౌన్ : పట్టణం, మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమలమయ్యాయి. ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షానికి రోడ్ల పైకి వచ్చేందుకు స్థానిక ప్రజలు ఆసక్తి చూపించకపోవడంతో ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. మూడు రోజులుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటన చేస్తుండడంతో, వర్షాలు వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయో అని లోతట్టు ప్రాంతాల ప్రజలు శివారు కాలనీల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వంశధార తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన రెవెన్యూ సిబ్బంది.

భామిని : మండలంలోని వంశధార నది తీర ప్రాంత గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రజలను ఆదివారం అప్రమత్తం చేశారు. ప్రస్తుత వర్షాలు రీత్యా, నది నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని, గ్రామస్తులు నదిలోకి స్నానానికి వెళ్లొద్దని, అలాగే పిల్లల్ని నది వైపు పంపించొద్దని సూచించారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో వంశధార నదీతీర గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహశీల్దార్ శివన్నారాయణ సూచించారు. నేరడిలో వంశధార దాటేందుకు పడవలను నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు మణి ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

నేడు, రేపు జిల్లాలో భారీ వర్షాలు

పార్వతీపురం : జిల్లాలో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆగస్టు18, 19 తేదీల్లో భారీ వర్షాలు కురిసే సమయంలో ఆరుబయట ఎవరూ తిరగరాదని, శిథిలావస్థలోని భవనాలు, చెట్ల కింద ఉండరాదని సూచించారు. లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ప్రజలు సమాచారం పొందడం, తీసుకోవడం చేయవచ్చని అన్నారు.

స్థానికంగా ఉండరు... హౌస్ అలవెన్స్ వదలరు

ఇదీ ఏరియా ఆసుపత్రి వైద్యుల తీరు

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసిన వైద్యులు స్థానికంగా ఉండాలని నిబంధనలు ఉన్నాయి. పనిచేసే చోట నివాసం ఉండాలని, ఉన్నత అధికారులు ఆదేశాలు ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. డివిజన్ కేంద్రమైన స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. స్థానికంగా ఉండాల్సిన వైద్యులు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఆస్పత్రిలో వైద్యులు ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు కూడా ఉదాసీనత చూపిస్తున్నట్లు సమాచారం. ఏరియా ఆస్పత్రిలో 19 మంది వైద్యులు ఉండగా నలుగురు మాత్రమే స్థానికంగా ఉంటున్నారు. ఆసుపత్రి సూపరిండెంట్ చిరంజీవి, గైనిక్ వైద్యులు భారతి, చిన్నపిల్ల వైద్యులు రవికుమార్, జనరల్ సర్జన్ స్థానికంగా ఉంటున్నారు. మిగతా వారిలో విజయనగరం నుంచి ఇద్దరు వైద్యులు రాకపోకలు చేస్తుండగా, పార్వతీపురం నుంచి ఇద్దరు వైద్యులు వెళ్లి వస్తున్నారు. మిగిలిన వైద్యులు శ్రీకాకుళంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. వారు వచ్చిన రోజే ఓపి, సేవలు అందే పరిస్థితి కనిపిస్తోంది. అసలే డివిజన్ కేంద్రంలో ఉన్న ప్రధాన ఆసుపత్రి. రోజుకు 200 తక్కువ లేకుండా ఓపి, 50 తక్కువ లేకుండా ఐపి నమోదు అవుతుంది. ఇంత రద్దీగా ఉన్న ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

హౌస్ అలవెన్స్ జేబుల్లోకి..

స్థానికంగా ఉండని వైద్యులు కూడా హౌస్ అలవెన్సులు తీసుకుంటున్నారు. వైద్యులకు హెచ్ఆర్ఎ కింద వారి జీతానికి 12 శాతం ఇస్తున్నారు. అయితే ఇక్కడ స్థానికంగా లేనప్పటికీ హెచ్ఆర్ఎ మాత్రం దర్జాగా తీసుకుంటున్నారు. స్థానికంగా ఉంటేనే హెచ్ఆర్ఎ తీసుకోవాల్సి ఉన్నప్పటికీ లేకుండానే డ్రా చేస్తున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యులు స్థానికంగా ఉండి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

నేల గుండె చప్పుడును పాటలుగా మలిచిన

'గంటేడ' అభినందనీయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

తాను పుట్టి పెరిగిన నేల గుండె చప్పుడును పాటలుగా మలిచిన గంటేడ గౌరునాయుడు అభినందనీయుడని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంటేడ గౌరునాయుడు రచించిన పాటలతో రూపొందిన 'పాడుదుమా స్వేఛ్ఛాగీతం' పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణాజీ మాట్లాడుతూ కళింగాంధ్ర ప్రజాజీవితాన్ని పాటలుగా మలచడంతో పాటు అనేక సామాజిక అంశాలపై తన ప్రతిస్పందనలను తన రచనల ద్వారా తెలియజేస్తూ సమాజాన్ని చైతన్యపర్చారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ గౌరునాయుడు పాటలను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. ప్రముఖ కవి పాయల మురళీకృష్ణ పుస్తకాన్ని పరిచయం చేసిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. ఉత్తరాంధ్రకు చెందిన గాయకులు గజల్ వినోద్, మల్లిపురం జగదీష్, కె.కృష్ణచంద్ర, ఎన్.గౌతమి, తిరుపతి తదితరులు గౌరునాయుడు రచించిన పలు గీతాలను ఈ సభలో ఆలపించారు. ఈ సందర్భంగా మండంగి రామారావు రూపొందించిన 'నాదేశ గతచరిత్ర నెత్తుటి మరక...' పాటల సిడిని డాక్టర్ వెంకట్రావు ఆవిష్కరించారు. అనంతరం గౌరునాయుడును దుశ్శాలువాతో సాహితీవేత్తలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వై.నాగేశ్వరరావు, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, సిరికి స్వామినాయుడు, పక్కి రవీంద్రనాథ్, చందనపల్లి గోపాలరావు, పల్లరోహిణీకుమార్, పాలకొల్లు రామలింగస్వామి, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

గౌరునాయుడును అభినందిస్తున్న సాహితీవేత్తలు

హైకోర్టు జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కత్తుల కవిటిలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గేదెల తుహిన్ కుమార్‌ను స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గౌరవపూర్వకంగా కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, జి.గౌరునాయుడు, చింత ఉమామహేశ్వరరావు, కర్నేని అప్పలనాయుడు, గర్భాన సత్తిబాబు, జి.నరేంద్ర, రౌతు కృష్ణంనాయుడు, తదితరులు ఉన్నారు.

తుణాల్లో సరుకులను పరిశీలిస్తున్న సిఐ రామకృష్ణ

షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

మండలంలోని తోనాంలో పలు షాపులను రూరల్ సిఐ పి. రామకృష్ణ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఇక్కడికి సుదూర ప్రాంతాల నుండి గిరిజనులు వస్తుంటారని వారికి ఈ షాపులలో నిల్వ ఉన్న, ఎక్స్‌పైర్ అయిన డేటులతో ఉన్న సరుకులను ఎవ్వరైనా అమ్మితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్త్రీ శక్తి పథకం మహిళలకు వరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్త్రీ శక్తి పథకం మహిళలకు వరమని, ఇది కేవలం ఆర్థిక భారాన్ని తగ్గించే పథకమే కాదని, మహిళల జీవితాల్లో ఆత్మ గౌరవం నింపే పథకమని అరకు పార్లమెంట్ తెలుగు మహిళ అధికార ప్రతినిధి, మాజీ జెడ్పిటిసి అక్కేన జగదీశ్వరి అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ముందుకు సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేల పింఛనను రూ.4వేలకు పెంచిందన్నారు. మహిళలకు మూడు ఉచిత సిలిండర్లు ఇచ్చి హామీలు నిలుపుకున్నారన్నారు. ప్రతి కుటుంబంలోనూ ఎంత మంది పిల్లలు స్కూల్‌కు వెళ్తే అంతమంది పిల్లలకు ఇచ్చిన మాట ప్రకారం తల్లులు ఖాతాల్లో రూ.15 వేలు వేసి తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20వేలు ఇస్తానని ఇచ్చిన హామీని, మొదటి విడతగా పిఎం కిసాన్‌తో పాటు ఏడు వేల రూపాయలు ఇచ్చి రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారని తెలిపారు. నేడు స్త్రీ శక్తి పథకం అమలు చేసి ఇచ్చిన మాట నిలుపుకున్న ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు.

చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సిఐ చంద్రమౌళి

గంజాయి రవాణాపై నిఘా

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గంజాయి రవాణాపై పోలీసులు డేగ కన్ను పెట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాలు, అక్రమ రవాణా అరికట్టేందుకు పట్టణంలోని కొండాపురం దగ్గర గాయత్రి ఆలయం సమీపంలో చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌ను సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - వీరఘట్టం

నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో వీరఘట్టంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి నాయకుల చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి నేతల సమక్షంలో నిర్ణయం తీసుకున్నందున రాష్ట్ర నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు, టిటిడి పాలకమండలి సభ్యులు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వైద్యం శాంతారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుకు పార్లమెంట సాధికార సమితి కన్వీనర్, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొన్నపు రవి, మజ్జి ఈశ్వరరావు, జనార్ధన్, టి.మహేష్, వెంకటి, ఎ.సాయి, కె.సాయిరాం, టి.సత్యం, వెంకటరమణ, శంకర్, డి.శ్రీనివాసరావు, పలువురు నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్‌స ఆవరణలో స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ నియంత్రణపై శ్రద్ధ ఏది?

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ కేంద్రమైన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర ట్రాఫిక్ రోజు రోజుకీ పెరిగి పోతుంది. వాహనాలు రద్దీ కూడా ఎక్కువగానే ఉంది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో సర్వీసులు కూడా పెరిగాయి. 74 సర్వీసులో ఉండగా ఉచిత సర్వీసు పథకం అమలయ్యాక మరో 10 బస్సులు అదనంగా పెంచారు. ఇంత రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల నుంచి అధికారులకు వినతులు వెళ్తున్నా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పిల్లి మీద ఎలక చందంగా ఒకరి మీద ఒకరు నెట్టేస్తున్నారు తప్ప పని జరగడం లేదు. ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకుంటే తాము స్పందిస్తామని నగర పంచాయతీ అధికారులు చెబుతుండగా తమకు కమిషనర్ గాని, ఆర్‌టిసి డిపో మేనేజర్ గాని లికిత పూర్వకంగా ఇస్తే స్పందిస్తామని పోలీసు అధికారులు చెప్తున్నారు. అయితే కాంప్లెక్స్‌కు ఔట్ గేటు సమీపంలో ఇరువైపులా రోడ్ల పైన దుకాణాలు వెలిశాయి. దీని వల్ల ప్రమాదాలు జరగడానికి ఆస్కారం కనిపిస్తుంది. ఆ షాపులు వేరేచోట ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువు కోరుతున్నారు.

షాపుల లీజు రద్దు సరే... బకాయిల సంగతి ఏమిటి?

వసూళ్లపై దృష్టి పెట్టని మున్సిపల్ రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న షాపులను లీజు ప్రాతిపదికను తీసుకున్న వ్యాపారులు అద్దెలను సకాలంలో మున్సిపల్ కార్యాలయానికి చెల్లించక లక్షల్లో అద్దెలు బకాయి పడడంతో మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆ షాపుల లీజును రద్దు చేసేందుకు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తీసుకుంటున్నారు. అయితే లక్షల్లో బకాయి పడ్డ అద్దెలను వసూలు చేసేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు దృష్టి చూపడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న ఐడిఎస్ఎంటి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 23, 40 షాప్‌లను లీజుకు తీసుకున్న అద్దెదారులు అద్దెలు చెల్లించకపోవడంతో వారి లీజులను రద్దు చేసేందుకు మున్సిపల్ రెవిన్యూ విభాగం అధికారులు గత నెల 31న జరిగే కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ ముందు ఉంచి తీర్మానం చేయించారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ షాపులను లీజుకు తీసుకున్న యజమానులు బకాయిపడ్డ అద్దెలు వసూలు చేసేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో చెప్పాలని స్థానికులు నిలదీస్తున్నారు. దీంతో పాటు 2022-23 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ మార్కెట్ ఆశీలు వసూళ్ల పాట రూ.26 లక్షలకు పాడిన సంబంధిత కాంట్రాక్టర్ రూ.9లక్షలు మాత్రమే మున్సిపల్ కార్యాలయానికి చెల్లించి మిగిలిన రూ.15 లక్షలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నప్పటికీ, సంబంధిత కాంట్రాక్టర్‌పై మున్సిపల్ రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా రెండేళ్ల తర్వాత కోర్టులో వేయడం వెనుక పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో పాటు 2023- 24 సంవత్సరానికి సంబంధించి పశువుల కమేళాలో ఆశీలు చేసేందుకు పాట పాడిన సంబంధిత కాంట్రాక్టర్ పాట వసూళ్ల సమయం పూర్తయినా రూ.35 వేలు చెల్లించలేదు. అయినా ఆ డబ్బును వసూలు చేసేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు చర్య చేపట్టకపోవడమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. లక్షలాది రూపాయలు బకాయిలతో పాటు ఐడిఎస్ఎంటి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న 23 వ నెంబర్ షాపుకు సంబంధించి రూ.3 లక్షల 88 వేలు, 40వ నెంబర్ షాపుకు సంబంధించి రూ.2 లక్షల 16 వేలు అద్దెలు బకాయి ఉన్నప్పటికీ వాటిని వసూళ్లు చేసేందుకు రెవెన్యూ అధికారులకు చీమకుట్టినట్టయినా లేదు. ఈ రెండు షాపుల లీజును రద్దు చేసేందుకు కౌన్సిల్ ముందు ఉంచారే తప్ప ఆ షాపుల నుంచి అద్దె వసూళ్లకు చర్యలు చేపట్టలేదు. దీంతో బకాయిదారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతుంది. ఈ బకాయిలపై పాలక వర్గ సభ్యులు కూడా సాధారణ సమావేశాలలో కనీసం చర్చించకపోవడం పట్ల బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షల్లో రావాల్సిన బకాయిలపై స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ రెవిన్యూ అధికారులు దృష్టి సారించి, వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేసి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

షాపుల సముదాయం

బైపాస్‌లో ప్రమాదాలను పట్టించుకోరా? : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఒక పక్క భారీగా ఏర్పడిన పెద్ద, పెద్ద గోతుల పరిస్థితిని ఆదివారం పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు వంగల దాలినాయుడు, కోలా కిరణ్ కుమార్, తీళ్ల గౌరీశంకరరావు కూటమి నాయకుల పాలనను ఏద్దేవా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల విషయంలో వైసిపి, కూటమి పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. వైసిపి పాలనలో రోడ్లన్నీ గోతులమయమైతే, కూటమి పాలనలో రోడ్లు ప్రయాణానికి పనికి రాకుండా పోయాయని ఎద్దేవా చేశారు. సాక్షాత్తు జిల్లా కేంద్రంలో పరిపాలన కాన రావడం లేదన్నారు. ఆయా రోడ్లలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రయాణాలు చేస్తే వారికి ప్రజల సాధక బాధకాలు తెలుస్తాయన్నారు. బైపాస్ రోడ్డు దుస్థితి చూస్తే మన్యం జిల్లాలో రోడ్లు భవనాల శాఖ, మున్సిపాలిటీ ఉన్నా లేనట్లే అనిపిస్తోందన్నారు. బైపాస్ రోడ్డులో ఏర్పడిన పెద్దపెద్ద గోతులు వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి వేళల్లో రోడ్డు గోతుల్లో పడి పలువురు గాయాల పాలవుతున్నారన్నారు. బైపాస్ రోడ్డు మీద నీరు చేరడం వల్ల ప్రయాణికులకు గోతుల అంచనా తెలియకపోవటంతో వాహనాలతో గోతుల్లో జారిపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బైపాస్ రోడ్‌లోని గోతులను తక్షణమే పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పాడైపోయిన బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజానికో గొయ్యి...

- గోతులమయమైన ఫ్లైఓవర్
- ప్రమాదాల బారిన వాహన చోదకులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గజానికి ఒక గొయ్యిలో ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలబారినపడుతుఆన్నరు. హనుమాన్ జంక్షన్ నుంచి అప్పయ్యపేట రైల్వే స్టేషన్ వరకు వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడికక్కడ గోతులు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో వర్షాలు కురిసే సమయంలో గొంతుల్లో నీరు చేరి వాహనదారులకు కనపడకపోవడంతో ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ రహదారి గుండా నిత్యం మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి అధికారులు ప్రయాణిస్తూనే ఉంటారు కానీ ఏ ఒక్కరూ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నిర్మించిన విద్యుత్ లైట్లు నాలుగేళ్లుగా వెలగకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై మరణించిన సంఘటనలు ఉన్నాయి. లైట్లు వేయాలని పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు జిల్లా అధికారులకు పలుమార్లు విన్నపాలు ఇచ్చినప్పటికీ జిల్లా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులుగానీ స్పందించకపోవడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. అనేక ప్రమాదాలు జరిగానా అధికారులు కనీసం గోతులు కప్పడానికైనా ప్రయత్నించకపోవడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి, విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేసి, గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడ్డ పెద్దపెద్ద గొయ్యిలు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రజాశక్తి - కురుపాం

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కురుపాం ఎస్సై పి.నారాయణరావు అన్నారు. ఆదివారం కురుపాంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేనిచో రూ.1000 అపరాధ రుసుం వేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి మద్యం సేవించకుండా వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని లచ్చిపేట జంక్షన్‌లో ఎస్ఐ ఎం.రాజేష్ వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహనదారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల వారికి ఎంతో మేలు చేకూరుతుందని, అంతేకాకుండా వారి కుటుంబానికి రక్షణ అని అన్నారు. అలాగే తెలియని వ్యక్తులు అనవసరపు కాల్స్ వస్తే వాటిని తిరస్కరించాలన్నారు. అంతేకాకుండా వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసేజ్‌లను గమనించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలన్నారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, ప్రతి ఇంటి యజమాని వారి పిల్లలను పట్ల ఎప్పుడూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనచోదకులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కిల్లాడలో యువతకు, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై ఎస్సై షేక్ మస్తాన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోర్ వీలర్స్ ఓవర్ లోడ్ వేయరాదన్నారు. అన్ని ధ్రువపత్రాలు, లైసెన్స్, సి-బుక్ తప్పనిసరిగా ఉండాలన్నారు. యువత గంజాయి, గుట్కా వంటివి వాటి జోలికి పోకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని సోమవారం నుంచి హెల్మెట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్సై ఎస్.సింహాచలం తెలిపారు. ఈ విషయంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పక ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు తన కుటుంబం రోడ్డున పడకుండా జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ జీవితాలను కాపాడుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పాచిపెంట : రోడ్డు భద్రతలో భాగంగా మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వద్ద సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహన చోదకులకు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న కురుపాం ఎస్ఐ నారాయణరావు

ఐటిడిఎలో నేడు పిజిఆర్ఎస్

సీతంపేట: స్థానిక ఐటిడిఎలో సోమవారం పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) యధావిధిగా జరుగుతుందని ఐటిడిఎ వర్గాల ద్వారా తెలిసింది. కావున ఐటిడిఎ పరిధిలో గల మండలాల గిరిజనులు తమ సమస్యలు విన్నవించుకోవచ్చుని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

రామభద్రపురం: మండల కేంద్రంలోని శ్రీరామనగర్ కాలనీకి చెందిన గోర్జి రమేష్ (44) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ వి.ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 15న కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగినట్లు కనుగొన్న బంధువులు బాడంగి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి 16న తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

మహాసభ కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

హక్కుల సాధనకు పోరాటాలే మార్గం

మహాసభ జయప్రదానికి సిఐటియు పిలుపు

ప్రజాశక్తి - సాలూరురూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కాలరాస్తున్న హక్కులపై సిఐటియు ఎనలేని పోరాటాలు చేస్తుందని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. సెప్టెంబర్ 13,14 తేదీల్లో పాలకొండలో జరగనున్న సిఐటియు 11వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. మహాసభకు సంబంధించిన ప్రచార పత్రాన్ని ఆయన నాయకులతో ఎర్రయ్య, సూర్య నారాయణ, రాముతో కలిసి ఆదివారం విడుదల చేశారు. అనంతరం నాయుడు మాట్లాడుతూ మన్యం జిల్లా ఏర్పడినప్పటికీ పారిశ్రామికంగా జిల్లాను ముందు ఉంచడంలో గానీ, మూసివేసిన పరిశ్రమలు లచ్చపేట షుగర్ ఫ్యాక్టరీ, జీగిరాం జ్యూట్ మిల్‌ను తెరిపించడంలో వైసిపి, కూటమి ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శించాయని తెలిపారు. కార్మిక వర్గానికి ఇఎస్ఐ హాస్పటల్ గానీ, ఉపాధి పొందేందుకు గిరిజన ప్రాంతాలను కలుపుకుంటూ ఎలాంటి పరిశ్రమల్లేవని, దీనివల్ల జిల్లా నుంచి అధికంగా వలసలు ఉంటున్నాయని, వెంటనే పాలకొండ, పార్వతీపురం, కురుపాం, సాలూరు నియోజకవర్గ కేంద్రాల్లోనూ, జిల్లా కేంద్రంలో ఇఎస్ఐ హాస్పిటల్లో అందుబాటులోకి తెచ్చి కార్మికులకు వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసే యంత్రాంగమే లేదని, లేబర్ ఆఫీసులు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయే తప్ప ఎలాంటి పర్యవేక్షణ జరగడంలేదని తెలిపారు. దీనివల్ల సినిమా థియేటర్లు, హాస్పటల్లో వ్యాపార సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులు కనీస వేతనాలకు నోచుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇక కాంట్రాక్టు ఉద్యోగులకు పిఎఫ్, పిఎఫ్, ఇఎస్ఐ సరిగా అమలు కావడం లేదని, అమలవుతున్నచోట సంక్షేమ పథకాలు నిలిపేశారని, దీనివల్ల వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని తెలిపారు. జిల్లాలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నా రని, రాజకీయాలు మారినప్పుడల్లా ఈ ఒరవడి సరికాదని ఇప్పటికే మక్కువ, పాచిపెంట, కరాసవలస, కెజిబివి పాఠశాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను మార్చాలని అతి తక్కువ వేతనాలకు పనిచేసే వారికి ఉద్యోగ భద్రత ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పుడు ఆ మాటలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని తెలిపారు. రానున్న కాలంలో జిల్లా వ్యాప్తంగా కార్మిక సమస్యలపై సిఐటియు పాలకొండలో సెప్టెంబర్ 13,14 తేదీల్లో జరుగుతున్న మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యచరణ నిర్ణయిస్తుందని, కార్మిక వర్గం ఈ మహాసభల జయప్రదానికి అన్ని విధాలా సహకారాలు అందించాలని కోరారు.

చాపరాయగూడకు తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వలసబల్లేరు పంచాయతీలో గల గిరిశిఖర గ్రామమైన చాపరాయగూడ గిరిజన గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు బి.అనిల్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామాన్ని సందర్శించి గిరిజనులకు అందుతున్న మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్న గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదని, కనీసం నేటికీ గిరి శిఖర గ్రామాలకు తాగునీరు, రోడ్డు, విద్య, వైద్యం అందని ద్రాక్షగా మిగిలాయని అన్నారు. మూడు నెలల క్రితం ఎంపిడిఒ, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ గ్రామాన్ని పర్యవేక్షించి బోర్ వేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ బోరు వెయ్యకపోవడంతో నేల బావి నీరు తాగుతున్నారని, వర్షాలు పడినప్పుడు నీరు బురదమయమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తప్పని పరిస్థితుల్లో అదే నీరు తాగాల్సి వస్తుందని, దీంతో గిరిజనులు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కావున ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బోరును వేయించి, గిరిజనులకు తాగునీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

బురదమయమైన తాగునీరు

ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని ప్రజాశక్తి వివరణ కోరగా, చాపరాయగూడను తాను, ఎంపిడిఒ సందర్శించామని, ఆ తర్వాత బోరు కోసం రిగ్ వాహనాన్ని పంపించామని తెలిపారు. అయితే ఆ గ్రామానికి వెళ్లే రహదారి బాగు లేకపోవడం వాహనం గ్రామానికి వెళ్లలేక పోయిందన్నారు. అయినప్పటికీ జెసిబి సాయంతో మార్గం సుగమం చేసి వెళ్ళమని సూచించామని, అయినా వాహనం అక్కడికి చేరలేదని అన్నారు. ప్రస్తుతం పిఎం జన్మాన్ పథకం కింద రహదారి మంజూరైందని, ఈ రోడ్డు పనులు పూర్తయ్యిన వెంటనే బోర్ తవ్వకాలను చేపట్టించి తాగునీటి సదుపాయం కల్పిస్తామని అన్నారు.

చెలమల నుంచి తాగునీటిని తెస్తున్న గిరిజన మహిళలు

నేరాలు ఘోరాలు

నాగావళి నదిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని అన్నవరం వద్ద కె.పవన్ (16) నాగావళి నదికి ఆదివారం స్నానానికి వెళ్లి మృతి చెందాడు. మూడు రోజులు సెలవు కావడంతో ఆముదావలస మండలం వజ్ర గూడ గ్రామానికి చెందిన పవన్ అన్నవరంలో పైడితల్లి ఇంటికి చుట్టరికానికి వచ్చాడు. నదిలో స్నానానికి వెళ్లి మునిగిపోయాడు. దీంతో స్థానికులు మృతదేహాన్ని బయటకి తీశారు. ఎస్సై ప్రయోగమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లారీ అదుపు తప్పి క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి - సాలూరురూరల్

కర్రల లోడుతో ఉన్న లారీ అదుపుతప్పి క్లీనర్ వెంకటరమణ లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే సాలూరు పట్టణానికి చెందిన లారీ జమాయల్ కర్రలను కూర్మరాజు పేట పంచాయతీ సీతందొర వలసలో రాయగడ జెకె పేపర్ మిల్‌కు తీసుకుపోవడానికి లారీ డ్రైవర్ ఆకేటి సన్యాసిరావుతో కలిసి లారీ క్లీనర్ మేడిశెట్టి వెంకటరమణ వెళ్లారు. వీరిద్దరు లారీ తీసుకొని సీతమ్మ సీతమ్మ దొరల వద్ద లోడ్ చేయించుకుని అనంతరం రాయగడ తీసుకోవడానికి సిద్ధమే తరుణంలో మూగడ వలస వద్దకు వచ్చేసరికి లారీ అదుపుతప్పి చెరువులో పడడింది. దీంతో క్లీనర్ వెంకటరమణ లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకటరమణకు వివాహమైనా భార్యను విడిచి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. అతనికి నలుగురు అన్నదమ్ములు, చెల్లి ఉన్నారు. వెంకటరమణ మరణించడంతో తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

లారీ కిందపడి మృతి చెందిన క్లీనర్ వెంకటరమణ